మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట





మీడియా సమావేశంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

# కాంగ్రెస్ నిరక్ష్య ధోరణి వీడాలి

**పక్కా ప్రణాళికతో రైతులకు అండగా నిలవాలి**
**మూడు విడుతల రైతుబంధు ఎగ్గొట్టారు**
**కరెంటు లేదు.. ఎరువులు లేవు**
**పంటలను కూడా కొనలేని దుస్థితి**
**ఎలాంటి డ్రామాలు సంబరాలు చేయలే**
**చెరువులను బాగు చేసి ఆయకట్టుకు సాగునీరందించాం**
**మీడియా సమావేశంలో మాజీ మంత్రి,**
**బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి**

**జడ్చర్ల,జూన్20,ప్రభాతవార్త:**కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, కనీస ప్రణాళిక లేకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల లోని అంబేద్కర్ భవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చి అన్నదాతలను కడుపులో పెట్టుకొని చూసుకున్నామని చెప్పారు. రైతును రాజు చేసే దిశగా కెసిఆర్ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేసిందన్నారు. వర్షాకాలానికి ముందే చెరువులను కుంటలను మిషన్ కాకతీయ పేరుతో బాగుచేసి రాష్ట్రంలో 45 వేల చెరువులకు పునర్జీవం అందించామన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు, 9:30 ఏళ్లలో 72వేల కోట్లతో 11విడుతలుగా రైతుబంధు సాయం అందించామన్నారు. కరోనా లాంటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా రైతుబంధు రైతు బీమా పథకాలు ఆపలేదన్నారు. అనుకోని ప్రమాదం జరిగి కుటుంబ పెద్ద ప్రాణాలు కోల్పోతే ఒక గుంట పొలం ఉన్న రైతుకు కూడా రూ. 5 లక్షల బీమా అందించామని గుర్తు చేశారు.

### కాంగ్రెస్ పాలనలో అడుగడుగునా అడ్డంకులే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండున్నర ఏళ్లలోనే రైతులను నాన్న ఇబ్బందులకు గురి చేస్తుందని లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు కూడా సరైన సమయానికి అందించలేని దుస్థితి ఏర్పడిందని, మూడు విడతలు రైతుబంధు ఎగ్గొట్టి అన్నదాతలను అవస్థలకు గురిచేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేవలం ఒక్కసారి మాత్రమే పూర్తిస్థాయిలో రైతుబంధు నిధులు విడుదల చేసి దానికి మళ్లీ పెద్ద ఎత్తున సంబరాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కనీసం మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఇలాంటి హంగు ఆర్భాటం ప్రచారం లేకుండానే నేరుగా రైతు ఖాతాల్లో నిధులు జమ అయ్యాయని చెప్పారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ఏర్పాటు చేయడంతో, వర్షాలు పడి రైతులు పంట నష్టపోయారని, గన్నీ బ్యాగులు లేక కేంద్ర ప్రభుత్వాన్ని సాకుగా చూపిస్తూ ధాన్యాన్ని సమయానికి కొనక రైతులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వానాకాలం ప్రారంభం అయినా ఇప్పటికీ ఎరువులు కూడా అందుబాటులో –మిగతా4లో..

## ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి

**బురెడ్డిపల్లి గ్రామ బొడ్రాయి ఉత్సవంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**



బొడ్రాయి ఉత్సవంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల,జూన్20,ప్రభాతవార్త :**ప్రజలు సుఖశాంతులతో నిండు నూరేళ్లు జీవించాలని మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్‌జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి వేడుకున్నారు.బూరెడిపల్లి గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికారు. వేడుకల్లో పాల్గొన్న లక్ష్మారెడ్డి గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠ గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి పేర్కొన్నారు.

### సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను

# వేగవంతం చేయాలి...

◆ **సెప్టెంబర్ 15లోగా పెండింగ్**
**సమస్యల పరిష్కారానికి**
**కార్యాచరణ రూపొందించాలి**
◆ **నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో**
**పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి,**
**డిండి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష**
**రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక**
**శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక సాగునీటిప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్రఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం,మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి,ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ,కసిరెడ్డి నారాయణరెడ్డి,డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ప్రాజెక్టుల వారీగా, నియోజకవర్గాల వారీగా భూసేకరణ పురోగతిని మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది,ఎంత భూమి పీడీ (ప్రాథమిక నోటిఫికేషన్)దశలో ఉంది,ఎంత భూమి పీఎం స్థాయిలో ఉంది, ఎన్ని అవార్డులు ప్రకటించారు, ఎంత పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.ఈసందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ఆ దిశగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను సెప్టెంబర్ 15లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాగునీటి వనరుల విస్తరణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి వంటి ప్రాజెక్టులు పూర్తైతే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాల మట్టం పెరిగి వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని మంత్రి స్పష్టం చేశారు.భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించడమే కాకుండా వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలు, భూవివాదాలు, పరిహారం చెల్లింపులకుసంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సహకారంతోనే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని, అందుకే రైతుల విశ్వాసాన్ని పొందే విధంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ప్రతి 15 రోజులు పురోగతిని సమీక్షిస్తూ –మిగతా4లో..





మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

## మోడీ పాలనలో విప్లవాత్మక మార్పులు

**అత్యధిక కాలం ప్రధానిగా రికార్డు**
**కేంద్ర వివక్ష చూపితే రాష్ట్రం అభివృద్ధి చెందేది కాదు**
**రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి**
**మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ**
**మహబూబ్‌నగర్‌లో మేధావుల సమావేశం**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జూన్ 20, ప్రభాతవార్త :** 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సాధించిన ప్రగతి,సంక్షేమ పథకాలు, విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మేధావుల సమావేశంలో ఆమె ప్రసంగించారు. నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో దేశంలో అనేక మార్పులు వచ్చాయన్నారు.అత్యధిక కాలం పాటు సేవలు అందించిన ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారని తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ మొదటి సారి నామినేట్ చేస్తే ప్రధాని అయ్యారు. మొదటి సారి ప్రజల నుంచి ఎన్నిక కాలేదన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి మూడవ సారి ప్రధానిగా నరేంద్ర మోదీ ఎదిగారని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు గుజరాత్‌తో పోల్చుకునే విధంగా అభివృద్ధి చేశారని, కాంగ్రెస్, బిఆర్ఎస్ రాష్ట్రంలో ఉందని వివక్ష చూపితే.. రాష్ట్రం అభివృద్ధి చెందేది కాదన్నారు.ఏ పథకం తీసుకున్న కులలకు మతాలకు అతీతంగా కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు. మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలకు 60శాతం నిధులు కేంద్రం ఇచ్చిందని, మరో రెండు మైనారిటీ పాఠశాలల కోసం వంద కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఎక్కడ వివక్షత లేకుండా నిధుల తెలంగాణకి కేంద్రం అందిస్తుందన్నారు.కాంగ్రెస్ జాతీయపార్టీ అని మరచి.. ప్రాంతీయ పార్టీ మాదిరి మాట్లాడుతున్నారని, కానీ సీఎం రేవంత్ రెడ్డి – మిగతా4లో..

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**పరీక్షా కేంద్రం గేట్‌లు మధ్యాహ్నం**
**1.30 గంటల తర్వాత మూసివేత**
**నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు**
**ఆర్ టి.సి.బస్సులలో ఉచిత ప్రయాణం**
**సెల్ ఫోన్‌లు,ఎలక్ట్రానిక్**
**గ్యాడ్జెట్స్‌కు అనుమతి లేదు**
**నీట్ పరీక్ష నిర్వహణ పై సంబంధిత**
**అధికారులతో సమీక్ష సమావేశం**
**నిర్వహించిన కలెక్టర్ కుష్బూ గుప్తా**



సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో జూన్20 ప్రభాతవార్త:** నేడు జరగనున్న నీట్ 2026 పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూగుప్తా తెలిపారు.జూన్ 21న నీట్ పరీక్షనిర్వహణ నేపథ్యంలో మహబూబ్‌నగర్‌జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా,జిల్లాఎస్.పి డి.జానకితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ పరీక్షల నిర్వహణలో భాగంగా సంబంధిత శాఖల అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రవాణా శాఖ అధికారులు విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 13 పరీక్షా కేంద్రాల్లోమొత్తం 4291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, విద్యార్థులందరికీ ఆర్టీసీ రవాణా శాఖ తరపున ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడినట్లు తెలిపారు. విద్యాశాఖ, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పరీక్షల సజావు నిర్వహణకు సహకరించాలని సూచించారు.అలాగే పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా,ఎటువంటి అంతరాయాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ హాల్ టికెట్/అడ్మిట్ కార్డ్‌లో పొందుపరిచిన అన్ని సూచనలు తప్పనిసరిగా చదివి, అందులో పేర్కొన్న నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2:00గంటల నుండి సాయంత్రం 5:15గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు,బుక్‌స్టాళ్లు/బుక్ సెంటర్లు పరీక్ష సమయాల్లో మూసివేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థులు తప్పనిసరిగా..అడ్మిట్ కార్డు/హాల్ టికెట్‌తోపాటు అయ్యే ఒరిజినల్ ఫోటో ఐడీ ప్రూఫ్‌వెంట తీసుకురావాలని తెలిపారు. వీటి పరిశీలన లేకుండా ఏ అభ్యర్థినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు.ఎన్‌టిఎ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డులో కేటాయించిన స్థలంలో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అతికించి తీసుకురావాలని సూచించారు.అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి కనీసం 2 గంటల ముందుగానే చేరుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే ప్రవేశం ఉంటుందని, 1:30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ అనుమతించరని స్పష్టం చేశారు.అభ్యర్థులు సాధారణ దుస్తుల్లో రావాలని, ముఖ్యంగా మహిళా అభ్యర్థులు సహా ఎవ్వరూ ఆభరణాలు,మెటల్ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు ధరించకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీలు నిర్వహించబడతాయని చెప్పారు.అభ్యర్థులు మొబైల్‌ఫోన్లు,స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, పుస్తకాలు, నోట్స్, స్టడీ మెటీరియల్ వంటి నిషేధిత వస్తువులు తీసుకురాకూడదని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిఆర్‌ఓఏ నిర్మల,కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, నోడల్ అధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్..

**రాష్ట్ర మైనార్టీ గురుకుల**
**విద్యా సంస్థల్లో అన్ని సౌకర్యాలు**
**మైనార్టీ విద్యార్థులు మంచి ఫలితాలు**
**సాధించి పాఠశాలకు,జిల్లాకు పేరు తేవాలి**
**రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ**
**మంత్రి మహ్మద్ అజారుద్దీన్**
**గత పాలనలో సొంత భవనాలు**
**లేక అవస్థలు : విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**
**తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్**
**బాలికల పాఠశాల భవనం, బాలికల**
**వసతి గృహం ప్రారంభోత్సవం**



బాలికల వసతి గృహం భవనాన్ని ప్రారంభించిన మహ్మద్ అజారుద్దీన్ ,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్20 ప్రభాతవార్త:** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ అని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ,ప్రభుత్వ రంగసంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు.మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రం బోయపల్లిలో రూ.20కోట్లతో నూతనంగా నిర్మించిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల భవనం1ను, రూ.2కోట్ల 10లక్షలతో నిర్మించిన బాలికల వసతి గృహం భవనంను రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ, ప్రభుత్వ రంగ సంస్థలశాఖా మంత్రి మహ్మద్ అజారుద్దీన్ , ప్రభుత్వ విప్,మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల సంక్షేమానికి కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు.మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని,జీవితంలో స్థిర పడాలంటే చదువు చాలా ముఖ్యం అన్నారు. ప్రభుత్వం మైనార్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో పొందిన విద్యఉన్నత విద్యకు పునాది అని తెలిపారు ముఖ్యంగా విద్యార్థినులు చదువుపై శ్రద్ధ పెట్టి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతున్నారు.విద్యార్థినిలు బాగా చదవాలని, వారి చదువు ఒక తరం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్య రంగం అభివృద్ధితో రాష్ట్రం,దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. విద్యార్థులు ఆటలతో పాటు చదువు నిర్లక్ష్యం చేయవద్దని,తమకు నైపుణ్యం ఉన్న రంగంలో కృషిచేసి ఉన్నత స్థానంకు ఎదగాలని సూచించారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,గురుకుల పాఠశాల విద్యార్థులు ఐ.ఏ ఎస్., ఐ.పి.ఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు.చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని,గురుకుల పాఠశాలలో పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి విద్య రంగం అభివృద్ధి కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని ఆయన అభినందించారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో మైనారిటీ పాఠశాలలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. గతంలో గురుకుల పాఠశాలలకు 60:40 నిష్పత్తిలో నిధులు మంజూరు చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను పూర్తిగా వినియోగించలేదని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చొరవతో కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించి నిధులు విడుదల చేయించామని తెలిపారు. ముఖ్యమంత్రి కృషితో ఈ పాఠశాల నిర్మాణం సాధ్యమైందని పేర్కొన్న ఆయన, ఇంకా రెండు భవనాలు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. మాటలతో కాదు – పనితో చూపించాలి" అనే సిద్ధాంతంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.తెలంగాణ అభివృద్ధి దిశగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు మహబూబ్‌నగర్‌లో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా యువతకు ఆధునిక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. టాటా వంటి ప్రాజెక్టుల ద్వారా సుమారు 25,000 మందికి – మిగతా4లో..

## నకిలీలపై కఠిన చర్యల హెచ్చరిక

**ధన్వాడలో విత్తన, ఎరువుల దుకాణాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు**



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక

**ధన్వాడ,జూన్20 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక శనివారం ధన్వాడ మండలంలోని విత్తన, ఎరువుల డీలర్ల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, రైతు వారీగా విత్తనాల అమ్మకాల రికార్డులు, యూరియా నిల్వలు మరియు పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో యూరియా యాప్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు నానో యూరియా, నానో డి.ఏ.పి వాడాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ , మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ , ధన్వాడ తహసీల్దార్ సింధుజ, ఎంపీడీవో అఫ్జల్, క్లస్టర్ ఏఈఓ సైమన్ పాల్గొన్నారు.

# 22,414 మంది రైతులు

**1,16,345.800 మెట్రిక్ టన్నులు**
**జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి**
**21,585 మంది రైతుల ఖాతాల్లో**
**రూ.265 కోట్లు జమ**
**మిగిలిన రూ.12 కోట్లు**
**మూడు రోజుల్లో విడుదలకు సన్నాహాలు**
**సవాళ్లను అధిగమించి**
**విజయవంతంగా ధాన్యం సేకరణ పూర్తి**



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా (ఫైల్)

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 20, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రబీ 2025, 26 సీజన్‌లో మహబూబ్‌నగర్‌జిల్లాలో రైతులు పండించిన ధాన్యం సేకరణ పూర్తయింది. కనీస మద్దతు ధర కింద కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 180ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి విజయవంతంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసింది. 22,414 మంది రైతుల నుంచి 1,16,345.800 మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించి రైతుల ఖాతాల్లో రూ.265 కోట్లు జమ జమ చేసింది.జిల్లాలో ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం), పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు),మెప్మా ఆధ్వర్యంలో – మిగతా4లో..

## వరికొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

◆ **కొనుగోలులో కేంద్రంపై ఆధార పడడం విడ్డూరం**
◆ **రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలి**
◆ **కాంగ్రెస్ సర్కార్‌కు రైతులపై ప్రేమలేదు..సర్కారును నడిపే సత్తాలేదు**
◆ **అన్నాసాగర్‌లో మీడియా సమావేశంలో**
**రేవంత్ సర్కార్‌పై మాజీ ఎమ్మెల్యే ఆల విమర్శనాస్త్రాలు**





మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్,జూన్ 20,ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతులు పండించిన వరి కొనుగోలులో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై – మిగతా4లో..

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

### ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో నాయకులు



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో నాయకులు

**నవాబుపేట,జూన్ 20 ప్రభాతవార్త :** పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కామారం గ్రామ సర్పంచ్ వెంకటేష్,మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం ఉదయం నవాబుపేట మండల పరిధిలోని కామారం గ్రామంలో బంటు అలివేలు రమేష్‌ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో వారు పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకారంతో మంజూరు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని అన్నారు. గూడులేని ప్రతి పేదలు సొంత ఇంటిలోనే జీవించాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యమని, అందుకే ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ జి.వెంకటేష్ తో పాటు మండల అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య, డిప్యూటీ సర్పంచ్ లక్ష ్మమ్మ, మాజీ సర్పంచ్ ప్రభాకర్, ఏఎంసీ చైర్మన్ హర లింగం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నమాజ్ రెడ్డి, తానేం సురేష్, ప్రేమ్ కుమార్, బడుగుల రవి, శిర్ప సత్యం, డిప్యూటీ సర్పంచ్ ఆంజనేయులు, కాకరజాల తాండ సర్పంచ్ సంతోష్ నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల లైసెన్సులు రద్దు

**బిజినేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త:** లట్టుపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా యూరియాను గరిష్ట రిటైల్ ధర కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న రెండు ఎరువుల దుకాణాల లైసెన్సులను రద్దు చేసినట్లు ఏడిఏ పూర్ణచందర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా లట్టుపల్లి గ్రామంలోని "అన్నదాత ట్రేడర్స్ ,రైతుమిత్ర ఫెర్టిలైజర్స్, సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్" దుకాణాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు సదరు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘన నిజమేనని నిర్ధారించారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం ఈ రెండు దుకాణాల విక్రయ లైసెన్సులను తక్షణమే నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. "జిల్లాలోని ఎరువులు, విత్తనాలు పురుగుల మందుల డీలర్లు ఎవరైనా సరే ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే సహించేది లేదన్నారు. ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు, ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దుతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## కొంగ దెబ్బకు ఖంగుతిన్న విద్యుత్ అధికారులు

### ఎట్టకేలకు కొంగన్ తొలగించిన విద్యుత్ అధికారులు

**ఉప్పునుంతల, జూన్ 20 ప్రభాతవార్త :** చినుకు పడితే కరెంటు పోతుందని ప్రజలకు ఓ అపనమ్మకం, శనివారం ఎలాంటి గాలి దుమారం లాంటి ప్రభావాలు లేకున్నప్పటికీ కొంగ దెబ్బకు కరెంట్ కట్, దీంతో విద్యుత్ అధికారులు ఖంగు తిన్నారు. గాలి, వర్షం ప్రభావంతో విద్యుత్తు లైన్లు బ్రేక్ డౌన్ అవుతాయని వారు అప్రమత్తమవుతారు. కానీ ఎలాంటి ఈదురు గాలులు, వర్షాలు లేకపోయినప్పటికీ 33/ 11 కెవి లైన్ బ్రేక్ డౌన్ కావడంతో విద్యుత్ అధికారులు ఖంగు తిన్నారు.33/11 కెవి విద్యుత్ లైన్ బ్రేక్ డౌన్ కావడంతో ఏఈ కొండల్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది లైన్ మాన్ బాలస్వామి, వెంకటేష్, బారయ్య, సాయి బాబులు ఉదయం నుంచి 33/11 కెవి లైన్ బ్రేక్ డౌన్ లో నిమగ్నమయ్యారు. అచ్చంపేట నుంచి ఉప్పునుంతల వరకు బ్రేక్ డౌన్ లైన్ పరిశీలించిన సమస్య పరిష్కారం కోసం వారు తలలు పట్టుకున్నారు. ఓ కుంటలో కొంగ దెబ్బకు విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లు గుర్తించి, వెంటనే కొంగను తొలగించారు. దీంతో బ్రేక్ డౌన్ సమస్య తొలగి పోయింది. దీంతో విద్యుత్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## బిఆర్ఎస్ సమావేశం విజయవంతం చేయాలి

### బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు

**ఉప్పునుంతల, జూన్ 20 ప్రభాతవార్త :** రేపు అచ్చంపేట లో జరుగు బిఆర్ ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి మండలంలోని బిఆర్ ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు కోరారు. బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ ఐ ఆర్ ఓటర్ నమోదు కార్యక్రమాల అవగాహన సదస్సు పై అచ్చంపేట బికె ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటలకు జరుగు అవగాహన సదస్సు కు నిర్వహిస్తున్నందున మండలంలో ఉన్న పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున మండలంలో ని పార్టీ శ్రేణులు, పార్టీ కార్యకర్తలు, బిఆర్ ఎస్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

## రాష్ట్ర అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డితోనే సాధ్యం

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిట్ల శేఖర్

**కోయిలకొండ జూన్ 20, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు పిట్ల శేఖర్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రమైన కోయిలకొండలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నా సన్మాన సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలకు, అభిమానులకు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి, మహబూబ్నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ వారి సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తను కలుపుకొని వెళ్లి పార్టీ అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పేట నియోజకవర్గం కుంభం శివకుమార్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డిలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను అన్నారు. కోయిలకొండ మండలంలో కాంగ్రెస్ పార్టీ ని అభివృద్ధి చేయడమే నా ముందున్న లక్ష ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## గ్రామ పంచాయితీ కార్మికులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న గ్రామ సర్పంచ్

**కోయిలకొండ జూన్20, ప్రభాతవార్త:** కోయిలకొండ మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు శనివారం మండల కేంద్రమైన కోయిలకొండలోని ఆది ఆంజనేయ స్వామి దేవాలయం లో వింజమూరు గ్రామ సర్పంచ్, వ్యాపారవేత్త కుమ్మరి మణెమ్మ రాములు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా దేవాలయంలో ఆలయ అర్చకులు డి ఎం రాఘవేంద్రరావు నవదీప్ జన్మదిన వేడుకలు సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేశారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సుజాత ఆనంద్, తహసిల్దార్ రాజా గణేష్ , మండల అభివృద్ధి అధికారి ధనుంజయ్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమ్మరి మన్నెమ్మ రాములు మాట్లాడుతూ తన కుమారుడైన నవదీప్ జన్మ వేడుకల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కుమ్మరి మన్నెమ్మ రాములు కోయిలకొండ మండలంలో సామాజిక సేవ చేస్తూ ప్రజల మన్ననలను పొందడం జరిగింది. ఆపద సమయాలలో ప్రజలను ఆదుకుంటూ ముందుకు సాగుతున్న వింజమూరు గ్రామ సర్పంచ్, వ్యాపారవేత్త కుమ్మరి మణెమ్మ రాములు ఇక ముందు ప్రజాసేవలో మరింతగా పాల్గొనాలని మండలంలోని పలువురు ఆయనను అభినందిస్తున్నారు.

## అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు విద్యార్థినుల ఎంపిక



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులు

**నారాయణ పేట, జూన్ 20 ప్రభాతవార్త :** నారాయణపేట స్థానిక శ్రీ చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ప్రతిష్టాత్మకమైన అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా.మెర్సీ వసంత వెల్లడించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల నుంచి రాణి (బీఏ), జె. అనూష (బీఏ), సానియా మిర్జా (బీకాం), కె. అశ్విత (బీజెడ్‌సీ) స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. మూడు సంవత్సరాల్లో రూ.90 వేల ఆర్థిక సహాయం అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ కింద ఎంపికైన ప్రతి విద్యార్థినికి మొదటి సంవత్సరం రూ.30 వేలు జమ చేసినట్లు తెలిపారు. రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం కూడా రూ.30 వేల చొప్పున అందడంతో మొత్తం రూ.90 వేల వరకు ఉపకార వేతనం పొందుతారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీ, ఇంటర్ పూర్తి చేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిన అర్హులైన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ అందజేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపల్ అభినందిస్తూ, స్కాలర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్,విశ్వనాథ్, కిషోర్,అహ్మద్ హుస్సేన్ తదితరులు విద్యార్థినులను అభినందించారు.

# రైతుల సేంద్రీయ పంటలను ఉత్పత్తి చేయాలి




మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ



హాజరైన నాయకులు, కార్యకర్తలు

**మదనాపురం, జూన్ 20 ప్రభాతవార్త :** వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం విధానం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. అందువల్ల రైతులు సేంద్రియ, జీవన ఎరువుల వాడకంపై అవగాహన పొంది వ్యవ సాయంలో అమలు చేయాలన్నారు. తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించాలన్నారు. పచ్చిరొట్ట, పశువుల ఎరువుల వాడకం ద్వారా భూమి జీవ శక్తిని కాపాడుకోవచ్చున్నారు,సేంద్రియ వ్యవసాయ విధానాలు మీకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ రాయితీల గురించి మరింత తెలుసుకోవడానికి,మీరు ఏ పంటలు పండిస్తున్నారు మరియు ఎంత భూమి ఉంది అనే వివరాలను చెబితేతగిన సమాచారం అందించగలను, ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. రసాయనిక ఎరువులతో పండించే పంటల వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు,ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతో అధిక దిగుబడిసాధ్యమవుతుందని వివరించారు, రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రెండుసార్లు పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు బిజెపి కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి,మండల బీజేపీ అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి,మహబూబ్‌నగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, కెవికె శాస్త్రవేత్తలు రాజేందర్ రెడ్డి బృందం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజా రెడ్డి , రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, అనుజ్ఞ రెడ్డి, దాబా శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గం ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భరత భూషణ్, కౌన్సిలర్ గాయత్రి సత్యం సాగర్, మాజీ కౌన్సిలర్లు నారాయణమ్మ, నవీన్ కుమార్ రెడ్డి, అడ్వకేట్ రాములు యాదవ్, నాయకులు మాధవరెడ్డి,కొండ వెంకటేశ్వర శెట్టి,బాబు గౌడ్, దుప్పల్లి కృష్ణ, మండల నాయకులు శివ నాయుడు, భాస్కర్, బురాన్,కురుమన్న, వడ్డె రాజు,హోటల్ శ్రీను, నితిన్, బాలవర్ధన్, మహేష్,ఆనందు, నాగరాజు, ఆంజనేయులు, రాములు, భీమన్న, రతన్‌లాల్,ఆశన్న, మైబు, రాము, శివ,రైతులు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోగ రహిత జీవితం యోగ వల్లనే సాధ్యం...



యోగ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవాణి పాఠశాల విద్యార్థులు

**ఆత్మకూర్ జూన్ 20, ప్రభాతవార్త:** సమాజంలో రోగారహిత జీవితం గడపాలంటే యోగా వల్లనే సాధ్యమవుతుందని శ్రీవాణి పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ టీజే విశ్వేశ్వర్ వెల్లడించారు. జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాణి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీజే విశ్వేశ్వర్ మాట్లాడుతూ 2015 జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం ప్రారంభించిన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2026 జూన్ 21న ఆరోగ్యం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే యోగా కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరూ శారీరకథ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాజంలో యోగా ద్వారానే అన్ని రోగాలను జయించవచ్చని ప్రధాన ఉద్దేశంతో ప్రారంభించబడిన యోగాలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రపంచానికి ఆదర్శ గురువుగా భారతదేశాన్ని నిలిపేందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగ అవగాహన సదస్సులో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సూర్య నమస్కారం,మూలంగా జరిగే శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడే పలు యోగాసనాలను విద్యార్థులకు చూపించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లతాగంగాధర్, ఉపాధ్యాయబృందం తిరుమలేష్, వెంకటేష్ గౌడ్ తదితరులతో పాటుగా పలువురు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయాలి



ఆత్మకూర్ విద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ జూన్ 20,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని భారత రాష్ట్ర సమితి అనుబంధ విభాగమైన విద్యార్థి సంఘం నాయకులు శనివారం రోజు ఆత్మకూరు మండల విద్యాధికారి శ్రీనివాసులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ వి మక్తల్ నియోజకవర్గం ఇన్చార్జ్ రియాజ్ అలీ మాట్లాడుతూ ఆత్మకూర్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకపోవడం మూలంగా ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు ఉదాసీన వైఖరి మూలంగా ఇష్టారాజ్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు మరియు దుస్తుల పేరిట పెద్ద మొత్తంలో నిధులను వసూలు చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని లేని పక్షంలో తమ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నవీన్, మహమూద్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలకు పిల్లలను పంపం: గ్రామస్తుల తీర్మాణం

### 8 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరిక




మాట్లాడుతున్న మండల విద్యాధికారి నాగ్య నాయక్

**నవాబుపేట, జూన్ 20 ప్రభాతవార్త :** చౌడూరు గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు మండల విద్యాధికారి నాగ్య నాయక్,సమక్షంలో గ్రామస్తులందరూ కలిసి ప్రైవేట్ పాఠశాలలకు గ్రామ విద్యార్థులను పంపమని ప్రభుత్వ బడిలోనే చదువుకోవాలని గ్రామస్తులందరి ఏకాభిప్రాయంతో ప్రభుత్వ బడిలోనే చదివించుకుంటామని తీర్మానించుకున్నారు. మండల విద్యాధికారి నాగ్య నాయక్ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ గ్రామంలో పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం అన్ని రకాల వసతులు గల పాఠశాలను వదిలి, ఇరుకు గదుల ప్రైవేటు పాఠశాలకు వెళ్ళవద్దని, పాఠశాలకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని, పూర్వ ప్రాథమిక పాఠశాలను కూడా మంజూరు చేస్తానని అదేవిధంగా గ్రామ సర్పంచ్‌కి ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా గ్రామపంచాయతీ తీర్మాణం చేయించాలని సూచించడం జరిగింది. గ్రామస్తులు మాట్లాడుతూ మన గ్రామంలో విద్యార్థులు మన పాఠశాలకే పంపించేందుకు తీర్మానం చేస్తున్నామని తీర్మాణాన్ని పాటించని వారికి ప్రభుత్వ పథకాలు నిలిపివేయడం జరుగుతుందని తీర్మానాన్ని అందరూ గౌరవించాలని సూచించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలకు వెళుతున్న మొత్తం 14 మంది విద్యార్థుల్లో 8 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగిందని కార్యక్రమంలో తీర్మానించుకున్నారు.జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, గ్రామ సెక్రెటరీ, మాధవి ఉప సర్పంచ్ లక్ష ్మయ్య శివలీల,పుష్పమ్మ, భీమమ్మ, శ్రీరాములు, ఆరిఫ్, గ్రామ నాయకులు కోట ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సెన్సేషనల్ వార్తల కోసం అబద్ధాలు ప్రచారం చేయొద్దు

### మీనాక్షి నటరాజన్‌ను అనవసరంగా కేసులోకి లాగారు

### పేట మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి



మాట్లాడుతున్న పేట మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి

**నారాయణ పేట, జూన్ 20 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మీడియా వార్తల సెన్సేషనల్ కోసం అబద్ధాలు ప్రచారం చేయొద్దని నారాయణపేట మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.తనపై ఉన్న లైంగిక వేధింపుల ఆరోపణ కేసులో ఏఐసిసి సభ్యురాలు మీనాక్షి నటరాజన్ ను అనవసరంగా కేసులో లాగారని వారు పేర్కొన్నారు తనపై లైంగిక ఆరోపణల పేరుతో శ్రీలత అనే మహిళ తనను రాజకీయంగా దెబ్బ కొట్టడానికి ఇతర రాజకీయ నాయకుల సహాయం తీసుకొని తనను మానసికంగా వేధిస్తోందని వారు అన్నారు. ఆమె తనపై శివకుమార్ రెడ్డి లైంగిక వేధింపులు చేశారని హైదరాబాదు, బెంగళూరులో కేసు నమోదు చేస్తే ఎలాంటి ఆధారాలు లేవని కేసును కొట్టివేయడం జరిగిందని వారు తెలిపారు. అయితే మాజీ డిసిసి అధ్యక్షులు శివకుమార్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని మీనాక్షి నటరాజన్ను ఆమె వినతిపత్రం ఇస్తే చర్యలు తీసుకోలేదని పేరుతో పరువు నష్టం కింద రూ.10 కోట్లు డిమాండ్ చేస్తూ కోర్టులో మీనాక్షి నటరాజన్‌తో పాటు పిసిసి అధ్యక్షులు, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, ఆమె తమ్ముడు పై ప్రైవేటు కేసు చేయాలని కోర్టును విన్నవిస్తే దాన్ని కోర్టు రాజకీయ కోర్టుకు బదిలీ చేసిందని వారు గుర్తు చేశారు. ఇప్పటి వరకు వారిపై ఎలాంటి కేసు లేదన్నారు. అనవసరంగా తన కేసును బూచి చూయిస్తూ మధ్యప్రదేశ్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన నామినేషన్ను తిరస్కరించారని వారు వాపోయారు. అయితే సదరు మహిళకు మధ్యప్రదేశ్ నాయకుడు స్పెన్సర్ లాల్ అందుబాటులో ఉండి రాజకీయంగా మీనాక్షినటరాజను ఎదుర్కోలేక నామినేషన్ తిరస్కరణకు పాల్పడ్డారని వారు పేర్కొన్నారు. తాను నారాయణపేటలో పుట్టకపోయిన తనబావ చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి ఆశయాలకోసం ఇక్కడ పనిచేస్తున్న అని, గత20 సంవత్సరాలుగా తాను ఎన్ని అవమానాలు, కేసులు జరిగినా వారి ఆశయాల నెరవేర్చడానికి వారి వారసులను ఇక్కడ తీసుకురావడానికి కృషి చేశానన్నారు. చిట్టెం పర్ణికా రెడ్డి గత ఎన్నికల్లో గెలిచిన వెంబడే సివిఆర్ ఆశయ సాధనలో భాగంగా సాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామన్నారు.పనులు చేరవేగంగా జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. భూములు కోల్పోతున్న వారికి సీఎంతో మాట్లాడి ఎకరాకు 20 లక్షల చొప్పున, రైతులకు ఆన్లైన్ లో డబ్బులు వేయించడం జరిగింది అన్నారు. నారాయణపేట నియోజకవర్గం లోని దాదాపు 70 శాతం భూములను ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లతో తడపనున్నామని పేర్కొన్నారు. తనకు వ్యక్తిగత స్వేచ్ఛ ఉందని, మరోసారి అనవసర విషయాలపై తన కుటుంబ సభ్యులను లాగితే వారి బండారం బయటపడతారని వారు హెచ్చరించారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం



బదిలీపై వెళ్తున్న రాఘవేందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**మూసాపేట్,జూన్20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంకలమద్ది గ్రామ పంచాయతీ కార్యదర్శినీ ఉపాధి హామీ కూలీల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంకలమద్ది గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన రాఘవేందర్ ఇటీవల జరిగిన బదిలీల్లో సంకలమద్ది గ్రామపంచాయతీ నుండి మద్దూరు మండలం కొండపూర్ గ్రామానికి బదిలీపై వెళ్లారు. శనివారం పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌ను శాలువా పూలమాలతో గ్రామ సర్పంచ్ మేరెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, టి ఏ సుజిత ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు రాఘవేందర్,అభిలాష్, ఆశవర్కర్ రాధా,అలివేలు,ఉపాధి కూలీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ హుండీ లెక్కింపు



కట్ట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హుండీ లెక్కింపు

**ఉప్పునుంతల, జూన్ ప్రభాతవార్త :** మండలంలోని లత్తిపూర్ గ్రామ పంచాయతీ శివారు లోని శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఉన్న కట్ట మైసమ్మ హుండీ ఆదాయం రూ.68 వేల396లు ఆదాయం వచ్చినట్లు కట్ట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్, ఈఇ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మైసమ్మ ఆలయ ప్రాంగణంలో 01.05.2026 నుంచి 20.06.2026 వరకు హుండీ లెక్కింపు నిర్వహించారు. కట్ట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్, తహసీల్దార్ అద్దంకి సునీత, దేవాదాయ శాఖ జిల్లా పరిశీలకులు మదన్ మోహన్, ఇఓ శ్రీనివాస్ రావు, ఎస్ఐ పుట్ట మహేష్,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్, ఎస్‌బిఐ బ్యాంక్ సిబ్బంది, ఏఎస్ఐ రెడ్యానాయక్, పోలీసులు యు.లింగం, వీరారెడ్డి, విష్ణు, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## కెజిబివి కళాశాలలో పిజి సిఆర్‌టి నర్సింగ్, ఎంఎల్‌టి పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**ఉప్పునుంతల, జూన్ 20 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో పిజిసి ఆర్‌టి నర్సింగ్, పిజి సిఆర్‌టి మల్టీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి సైదా పేర్కొన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎం పి హెచ్ డబ్ల్యు, ఎమ్ ఎల్ టి అతిథి అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. పీజీసీ ఆర్‌టి నర్సింగ్ పోస్టు 1, పిజిసి ఆర్‌టిఎం ఎల్‌టి పోస్ట్ 1 కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులను అనుభవం, డెమో ద్వారా ఎంపిక చేయబడునని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఈనెల 22,23 తేదీలలో కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రత్యేక అధికారి సైదా కోరారు.

## సీసీ కుంట ఎంపీడీవోగా అనురాధ



నూతన ఎంపీడీవో బాధ్యతలు చేపడుతున్న అనురాధ

**చిన్నచింతకుంట, జూన్20 ప్రభాతవార్త :** చిన్నచింతకుంట నూతన ఎంపీడీవోగా అనురాధ శనివారం పదవి బాధ్యతలను చేపట్టారు. మూసాపేట ఎంపీఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై సీసీకుంట ఎంపీడీవోగా రావడం జరిగింది.ఎఫ్ఎసి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన లక్ష్మీ నరసింహులు యధావిధిగా దేవరకద్ర ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓగా వెళ్లడం జరిగింది. ఈసందర్భంగా నూతన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందిస్తామన్నారు. మండల అభివృద్ధికి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

## యోగతో ఆరోగ్యమే మహాభాగ్యం : డీఈవో

**దామరగిద్ద,జూన్20 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి గోవిందరాజులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.ప్రతి విద్యార్థి యోగను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచించారు.నేడు నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించిన డీఈవో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి

**దామరగిద్ద, జూన్ 20 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలో ఓఎంఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వపథకాలు,సామాజికఅంశాలపై అవగాహనసదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ అద్దన్ కనకిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు సామాజిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మహిళా సంఘాలసభ్యులకు అవసరమైనమేరకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం ముందుకు వస్తోందని, పథకాల గురించి మరింత సమాచారం కోసం ప్రజాప్రతినిధులను సంప్రదించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష మాట్లాడుతూ మహిళలు సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలరని అన్నారు. తాను కూడా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదివి,ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. మహిళలకు సరైన మార్గదర్శనం, శిక్షణ అందిస్తే వారు మరింత అభివృద్ధి సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జీకే కవిత, పుట్టి స్వరూప, ఓఎంఫ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు హాజమ్మ, మండల కోఆర్డినేటర్ ఆశమ్మ, వాలంటీర్లు కృష్ణవేణి, సంతోష, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలి

**నర్వ, జూన్ 20 ప్రభాతవార్త:** ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శనివారం నర్వ మండల కేంద్రంలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నాయకులు ఎంఈఓ బి రాంరెడ్డికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ,మండల నాయకులు మ్యాతరి శంకర్,కల్వాల్ గోపి,కొత్తపల్లి మాజీ ఉపసర్పంచ్ రాజా రెడ్డి, డికె జనార్దన్ మాట్లాడుతూ మధ్యతరగతి,పేదవిద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వాస వెంకటేష్,మహేష్ గౌడ్,కొత్తపల్లి అశోక్,ప్రవీణ్ గౌడ్,నవీన్ యాదవ్,రాము గౌడ్,రాకేష్ గౌడ్,ఎల్ రమేష్,కే రవి,యస్ చరణ్,తదితరులు పాల్గొన్నారు.

**నారాయణపేటో..**

**నారాయణ పేట, జూన్ 20 ప్రభాతవార్త :** ప్రైవేట్ నారాయణ పేట జిల్లా ఉట్కూర్ మండల పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని బీఆర్ఎస్‌వీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యాభారం పెరుగుతోందని, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలను ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యా రంగంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని కోరుతూ అధికారులు స్పందించాలని తెలిపారు. టిఆర్ఎస్ యు జిల్లా అధ్యక్షుడు కోరం శివరాజ్ రెడ్డి, షేక్ సమీ, అభిలాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్, రాజేష్‌తో పాటు విద్యార్థి నాయకులు తదితరులు ఉన్నారు.

## మక్తల్‌లో వాసవి క్లబ్ డాన్ టు డస్క్ సేవలు

### సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పలు కార్యక్రమాలు

**మక్తల్‌టౌన్,జూన్20 ప్రభాతవార్త :**మక్తల్ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో డాన్‌టుడస్క్ పేరుతో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9:45కు నెరెడగం గోకులంలో గోవులకు దాణా అందించి ,10:45కు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ డోనర్ల వివరాల పట్టికను ప్రదర్శించారు. మధ్యాహ్నం 1:30కు బస్టాండ్ వద్ద ఎమర్జెన్సీ నంబర్ల పట్టికను ఏర్పాటుతోపాటు 2:00 గంటలకు పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్‌లో పదవతరగతి టాపర్లను గోల్డ్, సిల్వర్ మెడల్స్ ,మెరిట్‌సర్టిఫికెట్లు,శాలువాలతో సత్కరించారు.ముఖ్యఅతిథి ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రెటరీ భానూరి నర్సింలు, గెస్ట్ ఆఫ్ హానర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ స్వాతి కొంపల్ హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రతి ఏటా జూన్‌లో కోట్ల రూపాయలతో సేవలు చేస్తున్నామని, అన్ని కులాల వారికి సేవలందిస్తున్నామని వారు తెలిపారు. మధ్యాహ్నం 3:00కు తహసిల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5:00 గంటలకు ఆనంద నిలయం విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇల్లూరి సతీష్ కుమార్, మాజీ గవర్నర్ కల్వ శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, కార్యదర్శి కొత్త ఆంజనేయులు, కోశాధికారి తాళంపల్లి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఆవేదనతో ఆశా వర్కర్ ఆశమ్మ ఆత్మహత్య


**మక్తల్ టౌన్, జూన్ 20 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆశా వర్కర్ ఆశమ్మ(35) తనకున్న అనారోగ్యంతో మానసిక వేదన చెంది ఆశమ్మ ఆత్మహత్య చేసుకోవడం అందరిని కలతకు గురిచేసింది. మక్తల్ పట్టణంలో యాదవ నగర్‌లో నివాసం ఉంటున్న ఆశమ్మ ఆశావర్కర్‌గా పనిచేస్తు ఆర్థికంగా బాగోలేక ఎదిగిన పిల్లలకు చదువు పెళ్లీడుకొచ్చిన కూతురు, వైద్యపరీక్షలో తనకున్న రోగం బయట పడటం తన తోటి వర్కర్లు తనని దూరం పెట్టడం తను ఎక్కువ రోజులు బ్రతకనన్న నిరాశతో గురువారం మధ్య రాత్రి బీమా ఫేజ్ వన్ కెనాల్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న మక్తల్ పోలీసులు సంగం బండ రిజర్వాయర్ నింపేందుకు వదిలిన నీటిని బంద్ చేసి గాలింపు చేయగా శనివారం ఉదయం కాలువలో మృతదేహం బయటపడింది. ఈ ఘటన పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకున్న ఆశమ్మకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నట్లు సమాచారం.

## ఎస్ఐఆర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

**వెల్దండ,జూన్ 20 ప్రభాతవార్త:**ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా పారదర్శకంగా రూపొందించేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసిల్దార్ కార్తీక్ కుమార్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం తహసిల్దార్ కార్తీక్‌కుమార్ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్స్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, నెహ్రూ ప్రసాద్ బిఎల్ఓ బిఎల్ఎలకు ఎస్ఐఆర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 నుండి బిఎల్ఓలు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ నమోదు తొలగింపు, మార్పులు చేర్పులు చేయాలని నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి వారికి సమగ్రంగా వివరించారు. జూలై 24 వరకు ఇంటింటి గణన సమగ్రంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, జిపిఓ కిషన్, ప్రసాద్‌తో పాటు బూత్ లెవల్ ఆఫీసర్స్ ఏజెంట్లు ఉన్నారు.

## సీఎం చేతుల మీదుగా ప్రతిభ పురస్కారం..

**దేవరకద్ర, జూన్ 20 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలానికి చెందిన శ్రీకాంత్ యాదవ్ సన్నాఫ్ గొల్ల సాయిలు (గడ్డంపులి మనుమడు) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్న శ్రీకాంత్‌యాదవ్‌కు,కౌకుంట్ల సర్పంచ్ నరేష్‌కుమార్ మరియు యువకులు, హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ,ఈ గౌరవం ప్రతిభ, కృషి, అంకిత భావానికి నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి,ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ఘనతకౌకుంట్ల గ్రామానికి గర్వకారణం,ఈవిజయం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్ర మంలో ఉపముఖ్యమంత్రి రవాణా శాఖ మంత్రి, వివిధ ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ పురస్కారం అందుకుంటున్న శ్రీకాంత్ యాదవ్

## ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్ సీరియస్

### రెండు టిప్పర్లు, రెండు హిటాచీలు సీజ్!

**కృష్ణ,జూన్ 20 ప్రభాతవార్త :** కృష్ణానది తీరంలో సాగుతున్న అక్రమ ఇసుకదందాపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు.శనివారం గురజాల,ముడుమాల్ ప్రాంతాల్లో నదినుండి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తోడుతూ, రవాణా చేస్తున్న ముఠాలపై మండల తహశీల్దార్ శ్రీనివాస్ మెరుపు దాడులు నిర్వహించారు.ఈదాడుల్లో భాగంగా ముడుమాల్‌పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను అధికారులు పట్టుకున్నారు. అలాగే గురజాల పరిధిలోని కృష్ణా నదిలో ఇసుకను విచ్చలవిడిగా తవ్వుతున్న రెండు హిటాచీ (జేసీబీ) యంత్రాలను తహశీల్దార్ శ్రీనివాస్ స్వయంగా సీజ్ చేశారు. నది వనరులను కొల్లగొడుతూ, పక్క రాష్ట్రాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్న అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోందంటూ స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎస్ఐ, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, తహశీల్దార్ వెంటనే స్పందించి ఈ ముమ్మర దాడులు చేయడం గమనార్హం. ప్రభుత్వ సంపదను దోచుకుంటే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

# ఉమ్మడి జిల్లాలో 20 లక్షల ఎకరాలకు సాగునీరే లక్ష్యం...

- సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తాం...
- భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసి పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం...
- ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రాజెక్టులు పరుగులు
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:**ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లాను సాగునీటి పరంగా సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాలోని రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నీటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ, నిధుల అవసరం, సాంకేతిక సమస్యలు, పెండింగ్ పనులపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. మీడియా సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చారిత్రాత్మకంగా కరువు, వలసలు, నీటి కొరతకు ప్రతీకగా నిలిచిందని, ఆ పరిస్థితిని పూర్తిగా మార్చి పాలమూరును పచ్చని పంటలతో కళకళలాడే జిల్లాగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని సూచించారు. ఈ నెల 3, 4 తేదీలలో ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలో పర్యటించి వివిధ సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించారని, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల వేగంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న మంత్రి, ప్రస్తుతం భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ఎక్కడ భూ యజమానుల అభ్యంతరాలు ఉన్నాయి, ఎక్కడ పరిహారం సమస్యలు ఉన్నాయి, ఎక్కడ పరిపాలనా అనుమతులు అవసరమవుతున్నాయి అనే అంశాలన్నింటినీ సమీక్షించినట్లు వెల్లడించారు. రైతుల హక్కులకు భంగం కలగకుండా, చట్టబద్ధంగా, పారదర్శకంగా భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జూరాల, నెట్టెంపాడు, భీమ తదితర ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి రంగంలో కొత్త చరిత్ర సృష్టిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల పరిధిలో సుమారు 4 లక్షల 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, గత కొన్నేళ్లుగా కేవలం మూడు మోటార్ల ద్వారానే నీటిని ఎత్తిపోస్తున్న పరిస్థితి నెలకొన్నట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందడం లేదని చెప్పారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఎల్లూరు నుంచి నీటిని తరలించే చర్యలు చేపట్టడంతో పాటు మోటార్ల పునరుద్ధరణ, ఆధునీకరణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని, ప్రాజెక్టుల నిర్వహణలో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రాజెక్టులను కేవలం నిర్మించడం మాత్రమే కాకుండా రైతులకు నిజమైన ప్రయోజనం చేకూరేలా సమర్థవంతంగా నిర్వహించడంపైనా దృష్టి సారిస్తోందని చెప్పారు.ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలమూరు ప్రాంతానికి సంబంధించిన అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు తప్పకుండా పూర్తి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం వల్ల ఈ ప్రాంత అభివృద్ధిపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ కోసం ఇప్పటికే రూ.650 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, దీంతో భూసేకరణ ప్రక్రియ వేగవంతం అవుతోందని ఎంపీ తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా, ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు.నేటి సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలన్నింటినీ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీ వెల్లడించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అవసరమైన నిధుల విడుదల, పరిపాలనా అనుమతులు, భూసేకరణ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు.ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను కేవలం అభివృద్ధి కార్యక్రమాలుగా కాకుండా రైతుల భవిష్యత్తును మార్చే మహత్తర కార్యక్రమాలుగా భావిస్తోందని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల పూర్తి ద్వారా వ్యవసాయోత్పత్తి పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, వలసలు తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి విప్లవానికి నాంది పలికే ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షలాది మంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు చోటుచేసుకోనుందని, పాలమూరును సస్యశ్యామల జిల్లాగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పం త్వరలోనే ఫలితాలను ఇస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## చిన్నారుల ఆనందకర బాల్యానికి కృషి చేయాలి

**గద్వాల జూన్ 20,ప్రభాతవార్త :** చిన్నారులపై జరిగే వివిధ రకాల అఘాయిత్యాలను నివారించేందుకు వారి ఆనందకరమైన బాల్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌సభ్యులు రాజేంద్ర అన్నారు.గద్వాల మండలంలోని గోనుపాడు గ్రామం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలపై నేరాల నివారణ" అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలల హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతిపౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ,బాలల అక్రమరవాణా వంటి సమస్యలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అదే విధంగా పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు విధించబడతాయని తెలిపారు.తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, సంరక్షకులు పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించి, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలు, వేధింపులు, ప్రమాదకర పరిస్థితులకు భయపడకుండా పెద్దలకు తెలియజేయాలని,ప్రభుత్వంఅందుబాటులో ఉంచిన సహాయ వ్యవస్థలను వినియోగించుకోవాలని సూచించారు.ఈసందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన 1098 (చైల్డ్ హెల్ప్ లైన్), 100 (పోలీస్ అత్యవసర సేవలు) మరియు 15100 హెల్ప్‌లైన్ నంబర్లగురించి విద్యార్థులు,గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మన్న స్వామి,విద్యా శాఖ, భరోసా, సఖి సెంటర్ కోఆర్డినేటర్లు, పాఠశాలఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.




విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర

## పకడ్బందీగా ఓటరు జాబితా చేపట్టాలి

**చిన్న చింతకుంట, జూన్ 20 ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఓటర్ జాబితాను పకడ్బందీగా చేపట్టాలని తహసిల్దార్ ఎల్లన్న బిఎల్‌వోలకు సూచించారు. శనివారం తన ఛాంబర్‌లో ఆర్ఐ తిరుపతయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ను ఈనెల 25 నుంచి జూలై 24 వరకు బిఎల్ఎ, బిఎల్ఓ లు ఇంటింటి సర్వే చేపడతారని ఆయన తెలిపారు. 1200 మంది ఓటర్లు దాటితే కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తారన్నారు. జులై 31న ఓటర్ జాబితాను ప్రజల ముంగిట ఉంచడం,జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఈ ఓటర్ జాబితా పై అభ్యంతరాలపై ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలపై నోటీసు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రజల ముంగిట ఉంచుతామని ఆయన తెలిపారు. గ్రామాలలో ఇంటింటి సర్వేకు వెళ్లే బిఎల్వోలు ఎనిమినేటర్ పత్రంలో ఎలాంటి తప్పులు రాకుండా పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. ఈ పత్రాన్ని కుటుంబ యజమాని లేదా సభ్యులకు మాత్రమే ఇవ్వాలని ఆయన సూచించారు. స్పెషల్ ఓటర్ జాబితా పై ఇంటింటికి వచ్చే బిఎల్ఓ, బిఎల్ఎ లకు ప్రజలు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఎస్ఐఆర్ పై అన్ని రాజకీయ పక్షాల నాయకులు సహకరించి ఓటరు జాబితా ను ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సోమవారం ఎస్ఐఆర్ పై బిఎల్ఓ, బిఎల్ఏ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను ప్రకటిస్తున్న తహసిల్దార్ ఎల్లన్న

## మక్తల్ మండలంలో తపస్ సభ్యత్వ అభియాన్ ప్రారంభం

**మక్తల్ టౌన్, జూన్ 20 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమమే శరణ్యమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ అన్నారు. మక్తల్ మండలంలోని ఉప్పర్‌పల్లి, లింగంపల్లి, మాధ్వార్, సంగంబండ, చందాపూర్, కాట్రేవ్‌పల్లి, కర్ని, చిట్యాల, ముస్లాయిపల్లి, దాదన్‌పల్లి పాఠశాలల్లో శనివారం తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.రవీందర్ మాట్లాడుతూగత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తపస్ ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసిందని, అందుకు ఉపాధ్యాయులంతా తోడుగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ బడుల పటిష్టత కోసం కృషి చేస్తూ బాధ్యతగల జాతీయ భావాలు కలిగిన యువతను సిద్ధం చేయడమే తపస్ లక్ష ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగార్జున, గౌరవ అధ్యక్షులు నర్సిరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్ రాములు, మండల అధ్యక్షులు నరసింహ, ప్రధాన కార్యదర్శి రాకేష్, సహ కార్యదర్శి రాజంజనేయులు, కోశాధికారి అనిల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రామంజనేయులు, కాంప్లెక్స్ కన్వీనర్లు ప్రవర్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జగదీశ్, శివరాజ్, వెంకటేష్, కనకాద్రి, రాములు, కమలాకర్, మాధవి, పావని, నీలిమ, అనురాధ, అనిత, జ్యోతి, మౌనిక, షహీన్ ఫాతిమా, వరలక్ష్మి, కల్పన, రమ్య, ప్రతిభ, రమేష్, శివకుమార్, పూజిత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ మండలంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

### అడ్డుకుంటే అంతుచూస్తామని బెదిరింపులు

### అక్రమ ఇసుక దందాను అధికారులు తక్షణమే అరికట్టాలి

### బీఆర్ఎస్ మాజీ జడ్పీటిసి శివరాజ్ పాటిల్

**కృష్ణ జూన్ 20 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలోని కృష్ణ మండలం పరిధిలో ఇసుక మాఫియా రోజురోజుకూ రెచ్చిపోతోంది. గురజాల, ముడుమాల్, గుడేబల్లూరులోని వాసునగర్ ప్రాంతాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వందలాది టిప్పర్ల ద్వారా ఇసుకను పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. ఈ దోపిడీని ఎవరైనా అడ్డుకున్నా లేదా ప్రశ్నించినా "అంతు చూస్తాం" అంటూ ఇసుక మాఫియా బాహాటంగానే ప్రాణ బెదిరింపులకు పాల్పడుతోందని ఈ అక్రమ రవాణాపై మండల బిఆర్ఎస్ నాయకుడు శివరాజ్ పాటిల్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ సరిహద్దుల్లోని సహజ వనరులను కొల్లగొడుతూ, ప్రశ్నించిన స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఈ అక్రమ ఇసుక దందాను తక్షణమే అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన స్థానిక ఎస్ఐ మరియు జిల్లా ఎస్పీ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.పోలీస్, రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్పందించి, సరిహద్దుల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, అక్రమార్కులపై కఠినమైన కేసులు నమోదు చేసి ప్రజాధనాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మాజీ జడ్పీటిసి శివరాజ్ పాటిల్

## అగ్నివీర్‌గా ఎంపికైన మల్లికార్జున్‌కు సన్మానం

**దామరగిద్ద,జూన్ 20 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని సజనాపూర్ గ్రామానికి చెందిన యువకుడు బి. మల్లికార్జున్ ఇటీవల జరిగిన అగ్నివీర్ ఎంపికల్లో ఆర్మీ సైనికుడిగా ఎంపిక కావడంతో గ్రామంలో శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ అనంతమ్మ,ఉపసర్పంచ్ నరసింహులు సమక్షంలో జరిగిన ఈకార్యక్రమంలో మల్లికార్జున్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం సజనాపూర్ గ్రామం నుంచి తొలి సైనికుడిగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.దేశ భద్రతలో యువ సైనికుల పాత్ర ఎంతో కీలకమని, యువత దేశ సేవ పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమని అన్నారు. అలాగే తమ కుమారుడిని దేశ సేవకు పంపిస్తున్న మల్లికార్జున్ తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనకప్ప, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

### పలకలు పంపిణీ చేసిన సర్పంచ్ అనంతమ్మ, ఉపసర్పంచ్ రవి

**దామరగిద్ద,జూన్20 ప్రభాతవార్త :**దామరగిద్ద మండలం అన్నసాగర్ గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో 1వ తరగతిలో చేరిన 22 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ అనంతమ్మ, ఉపసర్పంచ్ రవి విద్యార్థులకు పలకలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ అనంతమ్మ మాట్లాడుతూ జీవితంలో మొదటి అక్షరం ఎంతో కీలకమైనదని, విద్యార్థులు బాగా చదువుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు కొత్త మాలే నర్సిములు, అంజప్ప, నర్సిములు, ప్రధానోపాధ్యాయులు ఉసెనప్ప, ఉపాధ్యాయులు ప్రవీణ్, శారద, అలి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి చెక్కు అందజేత

**మద్దూరు, జూన్ 20 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రేణివట్లకు చెందిన పని చిన్న సాయప్ప కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 లక్షల ఎల్ఓసి చెక్కును శనివారం అందజేశారు.హైదరాబాద్‌లోని ఆసుపత్రి వద్ద పిఏసిఎస్ చైర్మన్ గుళ్ళ నర్సిములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి,అశోక్‌గౌడ్,మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి ఇబ్రహీం కలిసి బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందించారు.ఈసందర్భంగా వారు సాయప్ప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## జర్నలిస్టుల ఇండ్లకోసం ఎమ్మెల్యేకు వినతి

**దేవరకద్ర,జూన్ 20 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ టియుడబ్ల్యుజె ఐజెయు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాటం నాగరాజు ఆధ్వర్యంలో దేవరకద్ర జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి శనివారం రోజు వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాలలో బండలను తొలగించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.వెంటనే ఎమ్మెల్యే కాంట్రాక్టర్ కరుణాకర్ తో ఫోన్ మాట్లాడి బండలను తీయించాలని సూచించారు.అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలతో పాటు, ఇండ్లు నిర్మించేందుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో ఐజేయు జిల్లాఅధ్యక్షుడు కాటం నాగరాజు,ప్రశాంత్(దిశ), యం.డి. యాకుబ్(వార్త), నరేష్, సివిఆర్ న్యూస్,ఎల్లప్ప సూర్య తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయం

**వెల్దండ,జూన్20 ప్రభాతవార్త:**శాంతిభద్రత పరిరక్షణ ధ్యేయమని డీఎస్పీ వెంకట్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ యుగేందర్‌రెడ్డిని మండలంలోని పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మాదగద్రవ్యాలు దొంగతనాలపై ఎప్పుడూ నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మృతిచెందిన కుటుంబానికి ఆర్థికసాయం

**ఉప్పునుంతల, జూన్ 20 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన శానమోని మల్లయ్య గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని మిత్రులు 2003 సంవత్సరం బ్యాచ్ కు చెందిన పదవ తరగతి మిత్రులు శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మేడమోని కాశన్న, సి.హెచ్ మల్లయ్య, మెడమోని అర్జున్, గుద్దటి వెంకటయ్య, బాలు, పరశురాములు, బంగారయ్యలు ఉన్నారు.

